# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 21.12.2024 | 24 క్యారెట్లు 80,105.00 | కిలో వెండి 1,00,650.00 | 32 °C | సంపుటి:3 సంచిక:59

www.vishalabharati.com


## 'ధరణి'పై విచారణ..

- ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆదేశాలు
- బీఆర్ఎస్ హయాంలో భారీ భూదందా
- చేతులు మారిన వేల ఎకరాల భూములు
- బీఆర్ఎస్ నేతల అస్మదీయుల పేరిట రిజిస్ట్రేషన్లు
- అక్రమాలు నిగ్గు తేలుస్తామన్న మంత్రి పొంగులేటి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

'ధరణి'పై ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆదేశిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభలో ప్రకటించారు. శుక్రవారం అసెంబ్లీలో భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ధరణి'పై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1.50 లక్షల కోట్ల విలువ చేసే భూములు చేతులు మారాయని

..మిగతా 2 లో



## అసెంబ్లీలో రచ్చ రచ్చ

- రెచ్చిపోయిన బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులు
- వాటర్ బాటిళ్లు విసురుకొని... బూతులు తిట్టుకుంటూ
- బీఆర్ఎస్ సభ్యుల ఓవర్ యాక్షన్
- వెల్‌లోకి దూసుకొచ్చి గందరగోళం
- పేపర్లు చింపి స్పీకర్ చాంబర్ వైపు విసిరివేత

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. ఆరో రోజు సమావేశాల్లో భాగంగా సభలో గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మాటల యుద్ధంతో సభ దద్దరిల్లింది. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ భారతి బిల్లుపై మాట్లాడుతుండగా ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్‌పై పెట్టిన హైదరాబాద్ ఫార్ములా ఈకారు రేసు అంశంపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు పట్టుకొని సభ్యులు స్పీకర్ వెల్‌లోకి దూసుకొచ్చి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్,

..మిగతా 2 లో

## బీఆర్ఎస్‌కు అంత అహంకారమెందుకు?

### ప్రజలను పీడించిన ధరణిని బంగాళాఖాతంలో వేశాం



- తట్టుకోలేక పోతున్నారా?
- 50 లక్షల మంది రైతుల జీవితాలను నాశనం చేశారు
- విదేశీ సంస్థల చేతిలో రైతులకు సంబంధించిన భూ వివరాలు
- ఇంత దారుణమైన పోర్టల్ అసలు ఎందుకు ఉండాలి?
- బీఆర్ఎస్ సభ్యులు క్రమశిక్షణ కోల్పోయారు
- అసెంబ్లీ సంప్రదాయాలు తుంగలో తొక్కారు
- శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' పోర్టల్ అన్నదాతలకు భూములను దూరం చేసిందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీలో శుక్రవారం ఆయన మాట్లాడారు. విపక్ష పార్టీ అహంకారంతో వ్యవహరిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా మర్యాదలను ఉల్లంఘించి గందరగోళం సృష్టిస్తున్నారని.. సభాపతిపైనే దాడి చేసే ధోరణిలో చర్చను అడ్డుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని.. ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి అని చెప్పారు. గులాబీ నేతలు రెచ్చగొట్టడం ద్వారా 'భూ భారతి' బిల్లుపై చర్చను పక్కదారి పట్టించాలని చూస్తున్నారని అన్నారు. విపక్షాలు ఎంత రెచ్చగొట్టినా సభాపతి ఓర్పుతో వ్యవహరించారని..ఏమాత్రం సహనం కోల్పోకుండా వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారని ప్రశంసించారు.


**సభలో గందరగోళం**

తెలంగాణ అసెంబ్లీని శుక్రవారం ఫార్ములా- ఈ కార్ రేస్ వ్యవహారం షేక్ చేసింది. దీనిపై చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలోనే నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫార్ములా ఈ రేస్ కేసుపై చర్చకు పట్టుబట్టారు. సభకు వస్తూనే కేసుపై నిరసన చేస్తూ వచ్చారు. కేటీఆర్‌పై పెట్టిన కేసు అక్రమమని నినాదాలు చేశారు. అందుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు ప్రదర్శించారు. ఎమ్మెల్యేలు వెల్‌లోకి దూసుకెళ్లేందుకు యత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. భూభారతి బిల్లుపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ నేతల ఆందోళనతో మంత్రి పొంగులేటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చిల్లర వేషాలను ప్రజలు హర్షించరని మండిపడ్డారు.

**ఆత్మగౌరవం నిలబెట్టింది..**

భూమి లేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వం భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టిందని సీఎం రేవంత్ అన్నారు. 'ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయి. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి మాత్రం అన్నదాతలకు భూములను దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే విధానాన్ని తెస్తే.. ఆ ప్రభుత్వం

..మిగతా 2 లో



## పరారీలో మోహన్‌బాబు

- ముందస్తు బెయిల్ నిరాకరించిన హైకోర్టు
- అరెస్ట్ భయంతో మరోసారి అజ్ఞాతంలోకి
- బెంగళూరులో ఉన్నట్లు పోలీసులు అనుమానం

2 లో

## శుక్రవారం.. భయం భయం

- రేవంత్ పాలనలో జనం వణికిపోతున్నారు
- ఏ ఉత్పాతం వస్తుందోనని గుబులు
- మెట్రో సీఈవోను లోపల వేస్తాడా?
- రేవంత్ అసలు ముఖ్యమంత్రిగా ప్రవర్తిస్తున్నారా?
- పిచ్చోడి చేతిలో రాయిలో రేవంత్ పాలన
- మాజీ మంత్రి హరీశ్ రావు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

సీఎం రేవంత్ రెడ్డి పాలనలో శుక్రవారం వచ్చిందంటే చాలు.. అందరూ భయపడే పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎవడన్నా నేషనల్ మీడియా ఇంటర్వ్యూలో ఎల్ అండ్ టీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను లోపలేయాలని పోలీసులకు చెప్పిన అని గర్వంగా చెప్పుకుంటడా. అంతకుమించిన

..మిగతా 2 లో



## హత్య కేసులో నిందితుడికి మరణశిక్ష

- నాంపల్లి కోర్టు సంచలన తీర్పు
- రెండేళ్ల క్రితం ముగ్గురిపై పెట్రోల్ పోసి చంపిన నిందితుడు
- సుదీర్ఘ వాదనల అనంతరం మరణశిక్ష వేసిన న్యాయస్థానం

2 లో

## ఎవరు మైనార్టీ..? ఎవరు మెజార్టీ..?

### ప్రతిఒక్కరూ సమానమే..

- దేశంలో పెరుగుతున్న మజీద్–మందిర్ వివాదాలు
- ఇవి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు
- భారత సామరస్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ కీలక వ్యాఖ్యలు



విశాలభారతి, నేషనల్ బ్యూరో:

మందిరాలు మసీదుల వివాదాలపై రాష్ట్రీయ స్వయంసేవక్ అధినేత మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. పుణెలో 'ఇండియాది విశ్వగురు' అనే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ''ప్రతిరోజూ కొత్త వివాదం తీసుకొస్తున్నారు. వీటిని ఎలా అంగీకరించమంటారు. ఇది జరగవద్దు. సామరస్యంగా ఎలా ఉంటామో భారత్ ప

..మిగతా 2 లో

## కేటీఆర్‌పై ఈడీ కేసు


- ఈ-కార్ రేస్ వ్యవహారంలో కీలక పరిణామం
- ఆయనతో పాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి పేర్లు
- ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఐఆర్
- మనీలాండరింగ్, ఫెమా నిబంధనల ఉల్లంఘన
- యూకే సంస్థ ఎస్ నెక్స్ట్‌పైనా కేసు
- బీఆర్ఎస్ శ్రేణులు, నేతల్లో ఆందోళన
- ఈడీ ఎంట్రీతో రాజకీయ కలకలం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఫార్ములా ఈకార్ రేస్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులోకి ఈడీ ఎంట్రీ ఇచ్చింది. కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై ఈడీ కేసు పెట్టింది. డిసెంబర్ 20న ఉదయం ఫార్ములాఈ కేసుకు సంబంధించి డిటైల్స్ ఇవ్వాలని ఏసీబీకి ఈడీ లేఖరాసింది. ఏసీబీ నుంచి ఎఫ్ఐఆర్ కాపీ తదితర వివరాలు అందటంతో ఈసీఐఆర్ నమోదు చేసింది ఈడీ. ఫార్ములా ఈరేస్ కేస్ లో

..మిగతా 2 లో






## కేటీఆర్‌ను అరెస్ట్ చెయ్యొద్దు

- డిసెంబర్ 30 వరకు చర్యలు తీసుకోకండి
- హైకోర్టులో స్వల్ప ఊరట
- ఈ నెల 27వ తేదీకి విచారణ వాయిదా

2 లో

## కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?

- జైలుకెళ్లి యోగా చేస్తానన్నావు కదా
- గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసులో చర్చ అనవసరం
- బీఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఫైర్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పార్లమెంటులో అంబేడ్కర్‌ను, అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించారని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీ

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
21.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
2
vishalabharathi Telugu Daily



# కేటీఆర్‌పై ఈడీ కేసు

మొదటిపేజీ తరువాయి

ఏ1,ఏ2,ఏ3లపై కేసులు పెట్టింది ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్. ఫెమా ఉల్లంఘన, మనీ లాండరింగ్ కింద కేసు నమోదు చేసింది. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా యూకేకు చెందిన ఎస్ నెక్స్ట్ కు రూ.46 కోట్ల నిధులు బదిలీ అయినట్లు ఈడీ గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థపై కూడా కేసు పెట్టింది ఈడీ.

ఫార్ములా ఈ- కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ ఫిర్యాదు మేరకు.. 13(1)(ఏ) రెడ్‌విత్, 13(2) ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్, 409 రెడ్‌విత్, 120(బి) ఐపీసీ సెక్షన్స్ కింద గురువారం ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసింది. రూ.55 కోట్లు అక్రమంగా విదేశాలకు తరలించిన ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడి(ఏ1)గా కేటీఆర్‌ను చేర్చింది. రెండో నిందితుడి(ఏ2)గా సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ అర్వింద్ కుమార్, మూడో నిందితుడి(ఏ3)గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బి.లక్ష్మీనర్సింహారెడ్డిని పేర్కొంది.ఈడీ తన ఎంక్వైరీ రెగ్యులర్ ప్రాసెస్‌లో భాగమే అయినప్పటికీ, బీఆర్ఎస్ శ్రేణుల్లోనూ నేతల్లోనూ ఆందోళన పెరుగుతోంది. ఫార్ములా ఈకార్ రేస్ నిర్వహణలో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు చెల్లింపులు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి లేకుండా విదేశాలకు రూ. 45.71 కోట్లు బదిలీ చేసినందుకు హెచ్ఎండీఏపై ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ రూ. 8,06,75,404 జరిమానా విధించింది. అదనంగా, వివిధ ఫీజుల రూపంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్, ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియాకు రూ. 1,10,51,014ను చెల్లించింది. మొత్తం ఫార్ములా ఈ రేస్ సీజన్ 10 కోసం రూ. 54 కోట్లకు పైగా హెచ్ఎండీఏ చెల్లించింది. హెచ్ఎండీఏ రూల్స్ ప్రకారం రూ. 10 కోట్లకంటే ఎక్కువ ఉన్న చెల్లింపులు చేయాలంటే.. ప్రభుత్వం, ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరిగా ఉండాలి.



## కూకట్పల్లి సర్కిల్ నూతన డిప్యూటీ కమీషనర్ గంగాధర్ కు శుభాకాంక్షలు తెలిపిన కర్క నాగరాజు

కూకట్ పల్లి విశాలభారతి:

ఇటీవల కూకట్పల్లి సర్కిల్ నూతన డిప్యూటీ కమీషనర్ గా పదవి భాద్యతలు చేపట్టిన గంగాధర్ ని టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి కర్కనాగరాజు ఆధ్వర్యంలో ఆయనకు శాలువాతో సత్కరించి పూల భోకేతో శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ కూకట్పల్లి సర్కిల్ పరిధిలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని, ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే సమస్యలను పరిష్కరిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఏ.ల్ గుర్తింపు హెచ్.ఏభ్యు యూనియన్ వైసెప్రెసిడెంట్ కుతాడి కృష్ణ, జాయింట సెక్రటరీ వెంకటపతి, జాయింట్ సెక్రటరీ నాగార్జున, ఆర్గనైసింగ్ సెక్రటరీ పోలేపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీనగర్ కాలనీ అభివృద్ధికి బడ్జెట్ కేటాయించాలి

- పెద్ద అంబర్పేట్ మున్సిపల్ చైర్మన్ వినతి

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ 3వ వార్డు లోని శ్రీనగర్ కాలనీనందు వేస్తున్నటువంటి డ్రైనేజ్ పైప్ లైన్ కు తగినంత బర్జెట్ ను కేటాయించాలని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ చైర్మన్ పండుగల జయశ్రీరాజు,వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి మూడో వార్డు కౌన్సిలర్ మణెమ్మ రామలింగంను కలసి వినతి పత్రం సమర్పించారు.గత మూడు సంవత్సరాల నుండి ఇబ్బంది పడుతున్నామని కావున మా కాలానికి ముఖ్యంగా ఉన్నటువంటి సమస్య డ్రైనేజి పైపు లైన్ పనులను అవుట్ లెట్ కు కావలిసినంత బర్జెట్ ను కేటాయించలాని శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వినోద్ కుమార్, కాలనీ సభ్యులు సోమయ్య, జనార్దన్, సాంబమూర్తి మరియు కాలనీ వాసులు కోరారు.



## కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను పరిశీలిలన చైర్మన్

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ లోని 8వ వార్డ్ లో గల పోచమ్మ ఆలయం అభివృద్ధికై నిరంతర కృషి చేస్తు నూతన కమ్యూనిటీ హాల్ కు స్లాబ్ వేయించి నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే 6వ వార్డు కౌన్సిలర్ పసుల రాజేందర్ తో కలిసి పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ పండుగుల జయశ్రీ రాజు అనంతరం పోచమ్మ ఆలయంలో అమ్మవారికి పూజ చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు.,ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్లు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు అంత అహంకారమెందుకు?

మొదటిపేజీ తరువాయి

తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతలను అప్పగించారు. ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే పిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలు ఈ సంస్థ చేతిలో పెట్టారు.

# పరారీలో మోహన్‌బాబు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గత కొన్ని రోజులుగా మంచు ఫ్యామిలీలో గొడవలు జరుగుతున్న సంగతి తెలిసిందే. మంచు మనోజ్, మోహన్ బాబు మధ్య ఆస్తి ఫైట్ జరుగుతుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ గొడవలను కవరేజ్ చేయ్యడానికి ఇంటికి వచ్చిన మీడియాపై మోహన్ బాబు దాడి చెయ్యడంతో ఆ జర్నలిస్ట్ ఆసుపత్రి బెడ్ పై ఉన్నాడు. ఇక మోహన్ బాబు జర్నలిస్టులపై దాడి చేయడంతో ఆయనపై హత్యాయత్నం సెక్షన్ల కింద కేసు నమోదైంది. పోలీసులు ఈ నెల 24 వరకు టైం ఇచ్చారు. అయితే మోహన్ బాబు ముందస్తు బెయిల్ కోసం కోర్టు మెట్లెక్కారు. అక్కడ నిరాశ ఎదురైంది. దాంతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తుంది. ఇప్పుడు ఆయన ఎక్కడున్నాడో తెలియడం లేదనే వార్త ప్రచారంలో ఉంది. జర్నలిస్టుపై జరిగిన దాడిని నిరసిస్తూ జర్నలిస్ట్ సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.. ఆవేశంలో కొట్టానని మోహన్ బాబు మీడియాను క్షమాపణలు అడిగారు. అంతేకాదు గాయపడిన జర్నలిస్ట్ ను హాస్పిటల్ వెళ్లి కలిశారు. కానీ జర్నలిస్ట్ సంఘాలు మాత్రం పోలీస్ కేసు వాపసు తీసుకోలేదు. దీంతో ఆయన కేసు కోసం ముందస్తు బెయిల్ పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. మోహన్ బాబు ఇటీవలే ముందస్తు బెయిల్ కోసం ట్రై చేయగా, కోర్టు నిరాకరించింది. దీంతో మోహన్‌బాబు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తుంది. గురువారం హైకోర్టు మోహన్ బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ జరిగింది. సోమవారం వరకు అరెస్టు చేయొద్దంటూ మోహన్ బాబు తరపు న్యాయవాది వాధించారు. అయితే ఏ క్షణమైనా మోహన్ బాబును అరెస్ట్ చేసే అవకాశం ఉంది. దీంతో మోహన్ బాబు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. తనపై నమోదైన కేసు దృష్ట్యా బెయిల్ కోసం హైకోర్టుని ఆశ్రయించిన మోహన్ బాబు.. ఏ క్షణమైనా పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతో అజ్ఞాతంలోకి వెళ్లారు.. మంగళవారం హైదరాబాద్ నుంచి చంద్రగిరికి మోహన్ బాబు చేరుకున్నారు. బుధవారం సాయంత్రం శ్రీ విద్యానికేతన్ నుంచి ఆయన వెళ్లిపోయారు. కాగా కలెక్షన్ కింగ్ బెంగళూరులో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.. దీనిపై పోలీసులు క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. ఇక పోలీసులు ఆయనను అరెస్ట్ చేయడానికి సమయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే మోహన్ బాబు తన దగ్గర ఉన్న రెండు గన్ లను ఇప్పటికే పోలీసులకు అప్పగించారు. ఇక అరెస్ట్ అవుతాననే భయంతో మోహన్ బాబు పరారీలో ఉన్నారు. మరి నిజంగా మోహన్ బాబు అజ్ఞాతంలోకి వెళ్ళారా లేదా అన్నది తెలియాల్సి ఉంది. పోలీసులు ప్రస్తుతం ఆయన కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

## ఎవరు మైనార్టీ..? ఎవరు మెజార్టీ..?

మొదటిపేజీ తరువాయి

రపంచానికి చూపించాలి. ప్రస్తుతం దేశం రాజ్యాంగం ప్రకారం నడుస్తోంది. ప్రభుత్వాన్ని నడిపే ప్రజాప్రతినిధులను ప్రజలే ఎన్నుకొంటారు. ఎవరో ఒకరి ఆధిపత్యం చేసే రోజులు ఎప్పుడో పోయాయి. ప్రతిఒక్కరూ తమను తాము భారతీయులుగా చెప్పుకొంటున్నప్పుడు ఆధిపత్యం ఎందుకు..? ఎవరు మైనార్టీ..? ఎవరు మెజార్టీ..? ప్రతిఒక్కరూ సమానమే. ఎవరి ఇష్టమైన దేవుడ్ని పాటించడమే ఈ దేశ ఆచారం. కాకపోతే నిబంధనలు, చట్టాలకు లోబడి సామరస్యంగా జీవించడం అవసరం'' అని భగవత్ ప్రసంగంలో పేర్కొన్నారు.

## 'ధరణి'పై విచారణ..

మొదటిపేజీ తరువాయి

ఆరోపించారు. లిటిగేషన్‌లో ఉన్న భూములను పార్ట్‌బీ లో పెట్టి ఆ భూములను సక్రమం చేసుకున్నారని తెలిపారు. దోచిన భూములను బీఆర్ఎస్ నేతలు తమ అస్మదీయులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు.

కొన్నిచోట్ల భూములకు యజమానులు ఇక్కడ లేరని.. పాకిస్తాన్ వెళ్లిపోయారని, అధికారులు నో అబ్జెక్షన్ చెప్పారంటూ ఆ భూములను కూడా కాజేశారని పేర్కొన్నారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తులు మీద మాత్రమే బదలాయింపు అయిందన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన అక్రమాలను నిగ్గు తేలుస్తామని ధ్వజమెత్తారు. ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులను కూడా కొల్లగొట్టారని ఆయన ఫైర్ అయ్యారు. అసెంబ్లీ లో ప్రతిపక్ష నేత కనిపించరని.. సభకు రారని సైటెర్లు వేశారు. రోజుకొక వేషంతో బీఆర్ఎస్ సభ్యులు డ్రామాలు ఆడుతున్నారంటూ మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?

మొదటిపేజీ తరువాయి

ఆవరణలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు. క్యాబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈరేసుకు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు అని అడిగారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని చెప్పారు. బీఏసీలో ఫార్ములా ఈరేసు మీద చర్చ కోసం భారాస ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని భారాస రాజకీయం చేస్తోందని విమర్శించారు.''జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా? కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళ్తే తప్పుపట్టిన ఆయన.. ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? కేటీఆర్‌కు నిజాయతీ లేదు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారు. వాళ్ల భూ కబ్జాల బాగోతం బయట పడుతుందనే ఇలా చేస్తున్నారు. అందరూ చట్టం ముందు సమానులే.. ఫార్ములా ఈరేసు కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే'' అని సీతక్క చెప్పారు.

# అసెంబ్లీలో రచ్చ రచ్చ

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ సభ్యులు పేపర్లు విసురుకున్నారు. చెప్పులు చూపించుకోవటంతో పాటుగా.. వాటర్ బాటిళ్లు సైతం విసురుకున్నారు. సభలో గందరగోళ పరిస్థితి తలెత్తటంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దళిత స్పీకర్‌ను అవమానించారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలుఅసెంబ్లీ ఆవరణలో నిరసనకు దిగారు. దళితుడైనా స్పీకర్ మీద పేపర్లు విసిరి అగౌరవపరిచారంటూ తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. సభా నియామాలు ఉల్లంఘించిన బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, ఆనాటి ప్రభుత్వ పెద్దలు ధరణిని అడ్డుపెట్టుకొని పేదల భూములు లాక్కొన్నారని.. భూముల వ్యవహారం బయటపడుతుందనే సభను అడ్డుకున్నారని ఆరోపించారు. స్పీకర్ ఛైర్‌ను బీఆర్ఎస్ సభ్యులు అవమానపరిచారని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలన్నారు. వాయిదా విరామం తర్వాత సభ ప్రారంభం కాగా.. ఒక వ్యక్తి కేసు గురించి ఇంత ఇష్యూ చేయటం సరికాదని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. సభను తప్పుదోవ పట్టించడం మంచిది కాదన్నారు. భూ భారతి ముఖ్యమైన బిల్లు అని.. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల వేళ ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. భూ భారతి బిల్లు ఆమోదం పొందాక బీఆర్ఎస్ సభ్యులను తన ఛాంబర్‌కు పిలుస్తానన్నారు. అయినా బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# కేటీఆర్‌ను అరెస్ట్ చెయ్యొద్దు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఫార్ములా ఈ కార్ రేసు వ్యవహారంలో నిధుల గోల్ మాల్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పది రోజుల వరకూ కేటీఆర్ ను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 27వ తేదీకి వాయిదా వేసింది. క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇరు వర్గాల న్యాయవాదులు హోరాహోరీగా వాదనలు వినిపించారు. కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు లాయర్ సుందరం వాదించారు.

# శుక్రవారం.. భయం భయం

మొదటిపేజీ తరువాయి

తలకుమాసినోడు ఎవడన్న ఉంటడా? ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎల్ అండ్ టి సంస్థకు చెందిన మెట్రో సీఈఓను లోపలేస్తా అన్నడు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ మాజీ కేంద్ర మంత్రి దివగంత దాసరి నారాయణ రావు గతంలో చంద్రబాబు పాలన ఎట్లుండెనో చెప్పేందుకు ఓ సినిమా తీసిండు. ఆ సినిమా పేరు పిచ్చోడి చేతిలో రాయి.. అట్లనే రేవంత్ రెడ్డి కూడా ఎప్పుడు, ఎవరి మీద పడుతడో, ఏం కేసులు పెడతడో తెల్వకుండా అయ్యింది. శుక్రవారం వచ్చిందంటే చాలు అందరూ భయపడే పరిస్థితి నెలకొని ఉందని హరీశ్‌రావు తెలిపారు.రైతుల మీద కేసులు, విద్యార్థుల మీద కేసులు, ఆటో డ్రైవర్ల మీద కేసులు, అంగన్ వాడీల మీద కేసులు, ఆశాల మీద కేసులు, చివరకు ఎక్కడి పోయిందంటే.. పోలీసుల మీద కూడా కేసులు పెట్టించిండు. సినిమా వాళ్ల మీద కూడా కేసులు పెట్టించిండు. ఆయన పాలనా వైఫల్యాలపై అడుగడుగునా నిలదీస్తున్న ప్రతిపక్ష నాయకుల మీద కేసులు పెట్టడం పెద్ద విషయమా? కేటీఆర్ మీద కేసులు పెట్టిండు, నా మీద పెట్టిండు, తలసాని మీద పెట్టిండు, పల్లా మీద పెట్టిండు, కౌశిక్ రెడ్డి మీద పెట్టిండు.. మా పట్నం నరేందర్ రెడ్డి అయితే నిన్ననే జైలు నుంచి బయటికి వచ్చిండు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.పోలీసులతో దబాయించు, అక్రమ కేసులు బనాయించు, అబద్దాలతో బుకాయించు. ఢిల్లీలోనేమో రాజ్యాంగ పరిరక్షణ కావాలె, గల్లీలోనేమో రాజ్యంగ భక్షణ చెయ్యాలె. 125 అడుగుల అంబేద్కర్ కే తాళం వేసి పెట్టిన ఘనత రేవంత్ రెడ్డిది. ఎండాకాలం వడ దెబ్బ తప్పించుకోవచ్చు గానీ, రేవంత్ రెడ్డి హైడ్రా దెబ్బ తప్పించుకోలేక రియల్ ఎస్టేట్ ఢమాల్ అయ్యింది. నువ్వు ఎన్ని కేసులు పెట్టినా, మా కేటీఆర్ నీ వెంటపడటం మానరు, నీ బండారం బయట పెట్టడం ఆపరు.

## హత్య కేసులో నిందితుడికి మరణశిక్ష

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రెండేళ్ల క్రితం ముగ్గురిపై పెట్రోల్ పోసి హతమార్చిన కేసులో ఓ నిందితుడికి నాంపల్లి హైకోర్టు మరణశిక్ష విధించింది. శుక్రవారం సుధీర్ఘ వాదనల అనంతరం న్యాయస్థాన మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. 2022లో నారాయణగూడకు చెందిన సాయిలు అనే వ్యక్తి.. తన భార్య, ఆమె ప్రియుడు, చిన్నారిపై పెట్రోల్ పోసి దారుణంగా హత్య చేశాడు. ఇక సాయులుకు సహకరించిన అతని స్నేహితుడు రాహుల్‌కు కూడా రూ.1000 జరిమానాతో పాటు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఇంతకీ అసలు ఏం జరిగిందో తెలియాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే.ఇక వివరాల్లోకి వెళ్తే.. నారాయణగూడ వంతెన కింద నాగులు సాయిలు, ఆర్తి దంపతులు పూలు అమ్ముకుంటూ జీవిస్తుండేవారు. అయితే వివిధ కారణాల వల్ల సాయిలు, ఆర్తి తరచుగా గొడవ పడేవారు. దీంతో ఆర్తి తన భర్తకు దూరంగా ఉండేది. ఈ నేపథ్యంలోనే నాగరాజు అనే యువకుడితో ఆర్తికి పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత అతడితో ఆమె వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని భర్త సాయిలుకు తెలిసింది. ఈ విషయంపై ఆమెను సాయిలు పలుమార్లు మందలించాడు కూడా. అయినప్పటికీ కూడా ఆర్తి పట్టించుకోలేదు.

దీంతో వాళ్లపై కక్ష పెంచుకున్న సాయిలు.. భార్య, ఆమె ప్రియుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో 10 నెలల చిన్నారి కూడా తీవ్ర గాయాలపాలైంది. చికిత్స పొందుతూ ముగ్గురూ కూడా ప్రాణాలు కోల్పోయారు. చివరికి ఆర్తి తల్లి ఫిర్యాదు మేరకు 2022లో కేసు నమోదైంది. రంగంలోకి దిగిన పోలీసులు దీనిపై దర్యాప్తు చేశారు. చివరికి దీనిపై కోర్టులో విచారణ జరగగా.. తాజాగా నాంపల్లి హైకోర్టు సాయిలుకు మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

## నారా లోకేష్ ను కలిసిన పరమేష్



**ఆమనగల్లు, విశాల భారతి :**

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ను ఉండవల్లిలోని వారి స్వగృహంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన పరమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు పరమేష్ చెప్పారు.






## క్షేత్ర సందర్శనకు ఆయిల్ పామ్ రైతులు

**సూర్యాపేట, విశాల భారతి**

ఆయిల్ పామ్ తోటల సాగులో మెలుకువలు తెలుసుకొనేందుకు సూర్యాపేట డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన పలువురు రైతులు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా లోని అంపాపురం నకు క్షేత్ర సందర్శనకు వెళ్లారు. ఆయా మండలాల్లో ఆయిల్ పామ్ తోటల సాగు చేయాలనుకునే రైతులు క్షేత్ర సందర్శకు వెళ్లి ఆయిల్ పామ్ సాగుచేస్తున్న రైతులతో ముఖా ముకి చర్చించారు. ఈ సందర్భంగా పంట సాగులో ఉండే కష్టా, నష్టాలు, పంట దిగుబడి, పంటను అమ్ముకునే విధానాన్ని నేరుగా అభ్యుదయ రైతులనుండి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంపాపురంలో ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరిని రైతులు సందర్శించి అక్కడ ఉన్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారిని కట్ట స్వాతి, పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ జే హరీష్, జూనియర్ మేనేజర్ శశి కుమార్,క్షేత్ర సహాయకులు సుధాకర్ రెడ్డి, లక్ష్మి నారాయణ, సురేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# అమిత్ షా రాజీనామా చేయాలి

- దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణలు చెప్పాలి
- పుల్లూరి సింహాద్రి పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు

**సూర్యాపేట, విశాల భారతి**




భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినటువంటి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కల్నర్ సంతోష్ బాబు చౌరస్తా దగ్గర నల్ల జెండాలతో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి మాట్లాడుతూ, అమిత్ షా తన ఒంటి నిండా మనువాద భావజాలాన్ని నింపుకోన్నారని ఆక్షేపించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ. బీసీ, మైనార్టీల హక్కులు, బాధ్యతల రక్షణ కు, వారి ఎదుగుదలకు, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం, సర్వోన్నతమైనదన్నారు. దాన్ని జీర్ణించుకోలేని మనువాద పాలకులు కుల, మత ఆధిపత్యాన్ని విస్తరింపజేయాలని చూస్తున్నారని అన్నారు. అంబేద్కర్ రాష్ట్ర రాజ్యాంగాన్ని ఈ బిజెపి మనువాద ప్రభుత్వం దాని స్థానంలో మనస్మృతిని తీసుకురావాలనే ప్రయత్నంలోనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు అంబేద్కర్ జయంతిని అంతర్జాతీయ రోజుగా జరుపుతూ మేధావిగా కీర్తిస్తుంటే. మన దేశ పాలకులు మాత్రం అవమానిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలకు ప్రధానమంత్రి మోదీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలని, కేంద్ర క్యాబినెట్ నుండి తొలగించి, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు సంధ్య, మౌనిక, మమత, నవ్య, మహేష్, పవన్, వినయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణ చెప్పాలి

**బాల్కొండ, విశాల భారతి**

గత రెండు రోజుల క్రితం పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని భీమ్‌గల్ మండల దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.అమిత్ షా అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు భీమ్‌గల్ బస్టాండ్ నుండి బడా భీమ్‌గల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపి అమిత్ షా దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అంబేద్కర్ పేరును కీర్తిస్తుంటే భారతదేశ కేంద్రమంత్రి పదవిలో ఉండి పార్లమెంట్లో అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా ప్రమాణం చేసి ఎన్నికైన వ్యక్తి, రాజ్యాంగ నిర్మాతని కించపరచడం అత్యంత దుర్మార్గమన్నారు. ఏ చట్ట సభల్లో అయితే అనుచిత వ్యాఖ్యలు చేశారో అదే చట్ట సభల సాక్షిగా అంబేద్కర్ కు క్షమాపణ చెప్పాలని దళిత సంఘాల పక్షాన డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు గడాల ప్రసాద్, రాజేందర్, శ్రీనివాస్, సునీల్, జెజె నర్సయ్య, అనంతరావు,రమేష్,రతన్,అనిల్, గంగాధర్ దళిత యువ నాయకులు, దళిత సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## షాప్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

- దళిత ఐక్య సంఘటన జిల్లా అధ్యక్షుడు సావెల్ గంగారాం

**బాల్కొండ, విశాల భారతి**

షాప్ లో పని చేస్తున్న యువకుడుతో పాటు ఆమె తల్లిని దూషించిన షాప్ యజమానిపై చర్యలు తీసుకోవాలని దళిత ఐక్య సంఘటన జిల్లా అధ్యక్షుడు సావెల్ గంగారాం డిమాండ్ చేశారు. శుక్రవారం భీమ్‌గల్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. షాప్ లో పని చేస్తున్న దళిత యువకుడుతో పాటు ఆమె తల్లిని ఇంటికి పిలిపించుకుని షాప్ యజమాని దాడి చేయడం జరిగిందన్నారు. దాడి విషయం డిసెంబర్ 3న జరిగిందని చర్యలు తీసుకోవాలని కోరుతూ డిసెంబర్ 4న బాధితులు పోలీసులకు పిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఫిర్యాదు ఇచ్చి 20 రోజులు అవుతున్నా పోలీసులు సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించడం తప్పా, కేసు నమోదు చేయడం లేదన్నారు. దళిత యువకుడు, ఆమె తల్లిపై దాడి చేసిన కేసులో వెంటనే షాప్ యజమానిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత ఐక్య సంఘటన ఆధ్వర్యంలో భీమ్‌గల్ బంద్ కు పిలుపు ఇస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దళిత ఐక్య సంఘటన నాయకులు పులి సాయిరాం,గడాల ప్రసాద్,రాజ్ కుమార్,కూనే రమేష్,మేకల శ్రీనివాస్,అనిల్ తదితరులు ఉన్నారు.

## ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్న పోలీసులు

**దేవరుప్పల, విశాల భారతి**



దేవరుప్పుల మండలం, గొల్లపల్లి వాగులో నుండి నన్ను బాల రమేష్, నన్ను బాల ఏక స్వామి, బండ కొత్తపల్లి గ్రామానికి చెందిన వారు రెండు ఇసుక ట్రాక్టర్ల లో అక్రమంగా వాగు నుండి ఇసుకను తరలిస్తుండగా సమాచారం అందిన వెంటనే పోలీసులు తక్షణమే అక్కడికి వెళ్లి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను,డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి దేవరుప్పుల మండల ఎస్సై ఊర సృజన్ కుమార్ కేసు నమోదు చేసారు. అనుమతి లేకుండ ఎవరైన ఇసుక గాని,మట్టిని గాని తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారి వెంట సిబ్బంది కూడా ఉన్నారు.



## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

**దేవరుప్పల, విశాల భారతి**

దేవరుప్పుల మండలం రామరాజుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ బండి నరసింహులు స్వామి గృహంలో అయ్యప్ప స్వాముల మహా పడిపూజ మధు గురుస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అయ్యప్ప స్వాములు విచ్చేసి పడి పూజలో పాల్గొన్నారు. రామరాజుపల్లి గ్రామంలో అయ్యప్ప పడిపూజ జరగడంతో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మశాస్త్ర హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి అనుగ్రహం ఉండి, ప్రతి ఒక్కరు దైవ మార్గంలో నడుస్తూ ప్రజలపట్ల ప్రతి ఒక్క జీవిపట్ల, ప్రేమ అనురాగాలు అందిస్తూ, తప్పులు చేయకుండా జీవనం గడపాలని, కోరారు. పడిపూజ కార్యక్రమంలో దాదాపు 100 మంది స్వాములు మరి కొంతమంది భక్తులు పాల్గొన్నారు.



## సాంకేతిక పరిజ్ఞానంతో సంస్కరణలు రావాలి

- ఓయూ వీసీ ప్రొ. కుమార్

**సికింద్రాబాద్, విశాలభారతి:**

విద్య, పరిశోధనా రంగాల్లో సాంకేతిక ఆధారంగా సంస్కరణలు తీసుకురావాలని ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం అన్నారు. పునరుత్పాదక వనరుల ద్వారా సుస్థిర అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఓయూలో "ప్రస్తుతం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లో సవాళ్లు - ఆవిష్కరణలు" అనే అశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పరిశోధకులు పలు అంశాలపై చర్చించి పరిష్కారాలు సూచించాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ ల ను అనుసంధానం చేయటం ద్వారా సత్వర, సుస్థిర పరిష్కారాల దిశగా ఆలోచించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలక్ట్రికల్ విభాగం అత్యంత ప్రాధాన్యమైన విభాగమని విద్యుత్తు లేని సమాజాన్ని 5 నిమిషాలు కూడా ఊహించలేమని ప్రొ. కుమార్ వివరించారు. విద్యుత్తు వాహనాల ఉత్పత్తి, వాడకం పెద్ద ఎత్తున పెరుగుతూ వస్తోందని ఈ రంగంలో విద్య, పరిశోధన, ఉపాధికి పుష్కలమైన అవకాశాలున్నాయని అన్నారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఐఐటీ కాన్పూర్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ప్రొ. సురేష్ చంద్ర శ్రీవాస్తవ మాట్లాడుతూ. ఓయూ ఎలక్ట్రికల్ విభాగ ప్రాధాన్యతను వివరించారు. సమకాలీన పరిస్థితుల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ సహా ఆధునిక సాంకేతికతను జోడించటం ద్వారా ఎలక్ట్రికల్ విభాగంలో విప్లవాత్మకైన మార్పులు రావాలని ఆకాంక్షించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సు సరికొత్త ఆలోచనలు, పరిశోధనలు, ఆవిష్కరణల ప్రతిపాదనలతో విజయవంతం కావాలని మరో అతిథి, ఓయూ పూర్వ విద్యార్థి గోపాల్ టి.కె కృష్ణ అభిప్రాయపడ్డారు. అంతకు ముందు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమ సమన్వయ కర్త సీనియర్ ప్రొ. ఏసురత్నం రెండు రోజుల సదస్సు ఉద్దేశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ విభాధిపతి ప్రొ. ఇ. విద్యాసాగర్, కో కన్వీనర్స్ ప్రొ. మంజుల, ప్రొఫెసర్ మంగు విభాగం అధ్యాపకులు, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## రామానుజన్ కనుగొన్న థీరీస్ వల్లనే కంప్యూటర్ సైన్సులో విప్లవాత్మక మార్పులు

- రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి

**సికింద్రాబాద్, విశాలభారతి:**

ఉస్మానియా యూనివర్సిటీ , మాథెమాటిక్స్ విభాగం ఆధునిక ప్రపంచంలో గణితశాస్త్రం: అప్లికేషన్‌లు మరియు సవాళ్లు అంశం పై రెండు రోజుల జాతీయ సదస్సు ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అథితులుగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి పాల్గొన్నారు. సదస్సు ను ఉద్దేశించి వారు మాట్లాడుతూ. రామానుజన్ జయంతి సందర్బంగా గణిత విభాగం లో నిర్వహిస్తున్న జాతీయ సదస్సును నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. రామానుజన్ కనుగొన్న థీరీస్ వల్లనే ఈనాటి కంప్యూటర్ సైన్స్ విప్లవాత్మకమైన మార్పులకు నాంది అయిందన్నారు. కామర్స్ లో సైతం గణిత అప్లికేషన్స్ ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఉదాహరణకు క్యాపిటల్ మార్కెట్ మాథమెటిక్స్ విద్యార్థులు అన్నింటిలో చురుగ్గా ఉంటారని, నేటి విద్యార్థులు బేసిక్ మాథ్స్ అప్లికేషన్ లో పట్టు సాధించాలని ,గణితంలో గొప్ప పరిశోదలను చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సదస్సులో అతిధి గా యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్ ప్రొ. పద్మావతి పాల్గొని రామానుజన్ గొప్పతనం గురించి మహిళ గణిత శాస్త్రవేత్తలు తయారు కావాలని కోరారు. అనంతరం విభాగం హెడ్ సావనీర్ విడుదల చేశారు. ఈ సదస్సులో ఓయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.గుండా.ప్రభాకర్ ,సదస్సు కన్వీనర్ ప్రొ. కృష్ణా రెడ్డి ,సదస్సు ఆర్గనైజింగ్ సెక్రెటరీస్ ప్రొ. నాగరాజు, ప్రో. ఫనీంద్రా సదస్సు కోకన్వీనర్ ప్రొ. హరిసింగ్, సీనియర్ ప్రొ. కిషన్, ప్రొ. సురేందర్ రెడ్డి, బి ఓ ఎస్ ప్రొ. ధనలక్ష్మి , ప్రొ.కిరణ్ , ప్రొ. వెంకట్ లక్ష్మి , ప్రొ. శ్రీనివాస్ పీజీ, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.



## ఫుడ్ కోర్టును ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల అందాలు

**దేవరుప్పల, విశాల భారతి**

దేవరుప్పుల మండలం సింగరజుపల్లి గ్రామంలోనల్ల యాదగిరి అల్లుడు తటికాయల శోభ స్వామి శ్రీమాత ఫుడ్ కోర్ట్ సెంటర్ కొడకండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల అండాలు శ్రీరామ్ రిభన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇప్ప వీర రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ మల్ల రెడ్డి, మండల యూత్ ప్రధాన కార్యదర్శి తాళ్ల పల్లి వేణు, కోపరేట్ బ్యాంక్ చైర్మన్ లింగాల రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ చిన్న మల్లారెడ్డి, మట్ట రాములు, చంద్రయ్య, కొంగరి రాములు, నర్సయ్య, శీను,ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
21.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


# జనగామ జిల్లా కోర్టు ఏజీపీగా చంద్రశేఖర్

▸ వల్మిడి వాసికి అరుదైన గౌరవం




**పాలకుర్తి, విశాలభారతి:**
మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది చెరుకు చంద్రశేఖర్ గౌడ్ కు అరుదైన గౌరవం దక్కింది. జనగామ జిల్లా కోర్టు (ఏజీపీ) అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర న్యాయ వ్యవహారాల కార్యదర్శి ఆర్. తిరుపతి పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. చంద్రశేఖర్ పదో తరగతి వరకు ముత్తారం ఉన్నత పాఠశాలలో, ఇంటర్ కొడకండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ తొర్రూరు సాయిరాం డిగ్రీ కళాశాలలో, హైదరాబాదులోని అంబేద్కర్ న్యాయ కళాశాలలో న్యాయ విద్యను పూర్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) చేశారు. బార్ కౌన్సిల్ లో పేరు నమోదు చేసుకొని 2013 నుంచి జనగామ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. పదో తరగతి చదువుతున్న రోజుల్లోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆకర్షితుడై ఆ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. 2001 నుంచి స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఉద్యమకాలంలో అనేక పోరాటాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. అప్పటి ప్రభుత్వం ఉద్యమకారులపై నిర్బంధఖాండ కొనసాగించినా ఏనాడూ భయపడకుండా ముందుకు సాగారు. 2001 నుంచి నేటి వరకు నిబద్ధతతో మచ్చలేని నాయకుడిగా ఎదిగారు. న్యాయ అంశాలపై మంచి పట్టున్న చంద్రశేఖర్ కక్షిదారుల కేసులు, సమస్యల పరిష్కారంలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు. అలాగే నలుగురిని కలుపుకపోయే, పది మందికి మేలు చేసే గుణం కలిగిన ఆయన అవసరార్థులకు అండగా నిలబడుతున్నారు .ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన విధులను ఎలాంటి పక్షపాతం, తారతమ్యం లేకుండా నిర్వర్తిస్తానని తెలిపారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి, న్యాయాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆటో యూనియన్ నాయకుల ముందస్తు అరెస్టు




**ఆమనగల్లు, విశాల భారతి :**
రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించనున్న ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలి వెళ్తున్న యూనియన్ నాయకులు ఇమాం సాహెబ్, శ్రీనివాస్, ఇబ్రహీం, షరీఫ్లను శుక్రవారం మాడుగులలో ముందస్తు అరెస్టు చేసినట్లు సీఐ జగదీష్ తెలిపారు. అనంతరం తహశీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఆయన వివరించారు.


# నేటి నుంచి ధ్యాన మహోత్సవాలు

**ఆమనగల్లు, విశాలభారతి :**
కడ్తాల మండలం అనుమాస్ పల్లి గ్రామ సమీపంలోనీ మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకోసం మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. డిసెంబర్ నెలలో జరిగే ధ్యాన మహోత్సవాలకు వివిధ దేశాలు, ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి సంబరాలలో పాల్గొంటారు. ఈ ఏడాది కూడా డిసెంబర్ 31 వరకు 14 రోజుల పాటు మహా పిరమిడ్ లో ధ్యాన ఉత్సవ సంబరాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ధ్యానుల కోసం ఉచితంగా అన్నదాన కేంద్ర, చిన్న పిల్లల కోసం బాల కేంద్రంతో పాటు అఖండ కేంద్రాలను సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ధ్యానులకు గదులతో పాటు తాత్కలిక వసతి గృహాలు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు వేలాది మంది ధ్యానం చేసేందుకు వీలుగా భారీ ప్రాంగణం ప్రత్యేకంగా అలంకరించిన పెద్ద వేదికను సిద్ధం చేసినట్లు పిరమిడ్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు మాధావి పేర్కొన్నారు.



## పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**తొర్రూరు, విశాలభారతి:**
రానున్న పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని మహబూబాబాద్ డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మహబూబాద్ జిల్లా హరిపిరాల ఉన్నత పాఠశాలలో మాజీ ఉప సర్పంచ్ చెంచర్ల రాజు పాఠశాల టీచర్స్ సహకారంతో పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 27 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం బి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాల సాధనకై పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయం అన్నారు. స్టడీ మెటీరియల్ ఉపయోగించుకొని విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు చదువు మీద శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థులు బెస్ట్ ప్రాక్టీస్ కింద పాఠశాలకు గైర్హాజరు కాకుండా ఉపాధ్యాయులు చూడాలని, పదోతరగతి విద్యార్థులను విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకోనీ వారి మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చయ్య, ఉపాధ్యాయులు ఎం రవి, కే సుధాకరా చారి, మధుకర్ రెడ్డి ,రాజేశ్వర్, కుమార్, సంపత్ కుమార్, సిహెచ్ శంకర్, రవీందర్, తస్లీమ సుల్తానా, మహేందర్, డి సంపత్,చంద్రప్రకాష్ ,ఆంజనేలు, పిడి రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మూసి నీటిని తక్షణమే విడుదల చేయాలి

▸ తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి



**సూర్యాపేట, విశాల భారతి**
మూసి ఆయకట్టు పరిధిలోని రైతులు పంట పొలాలు దున్ని నాట్లు పెట్టుకునేందుకు తక్షణమే నీటిని విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంవియన్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో వరి నాట్లు వేసుకునేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ రెండో వారంలో నీటిని విడుదల చేస్తున్న అధికారులు.. ఈ సంవత్సరం ఇంకా నేటి విడుదలకు షెడ్యూల్ రూపొందించకపోవడం సరికాదన్నారు. నీటిని ఎప్పుడు విడుదల చేస్తారని రైతాంగం మూసి అధికారులను అడిగితే మాకు ప్రభుత్వం నుండి ఆదేశాలు రాలేదని చెబుతున్నారని అన్నారు. నిండుకుండలాగా ఉన్న మూసి నీటిని కాలువల ద్వారా విడుదల చేస్తే బోర్లు, బావులలో భూగర్భ జలాలు పెరిగి రైతాంగానికి పంట పొలాలు దున్నడానికి నాట్లు వేయడానికి ఉపయోగపడతాయని అన్నారు. వృధాగా నీటిని ఏరులోకి విడుదల చేయడం మూలంగా రైతాంగానికి ఎలాంటి ఉపయోగం ఉండదని అన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మూసీ అధికారులు వెంటనే నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



## నాణ్యమైన సేవలు అందించి వినియోగదారుల మన్ననలు పొందాలి

▸ హైదరాబద్ కు పోటీగా సూర్యాపేటలో పెరుగుతున్న నయా ఫుడ్ కల్చర్

**సూర్యాపేట, విశాల భారతి**
నాణ్యమైన సేవలు అందించి వినియోగదారుల మన్ననలు పొందాలని పిసిసి సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని విద్యానగర్ లో జాజు రెస్టారెంట్ ను వారు ప్రారంభించినారు. ఈ సందర్భంగా కొప్పుల వేణా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే అందమైన పట్టణం సూర్యాపేట అని అన్నారు. సూర్యాపేట పట్టణంలో భోజన ప్రియులను ఆకట్టుకునేలా కొత్తగా హోటళ్లు వెలుస్తున్నాయని, హైదరాబాద్ సిటీని పోలిన విధంగా నయా ఫుడ్కల్చర్ మొదలైందని తెలిపారు. బ్రాండెడ్ దుస్తుల షాపింగ్ మాల్స్, బిర్యానీ సెంటర్లు క్యూ కడుతున్నాయని, సకల హంగులతో హోటల్స్ ప్రారంభ మవుతున్నాయని అన్నారు. హోటళ్లలో అందించే ఆతిథ్యం సరికొత్త పుంతలు తొక్కుతున్నదని, ఎల్లప్పుడూ కొత్తదనం కోరుకునే వినియోగదారులను వినూత్న థీమ్లతో ఆకట్టుకుంటున్నదన్నారు. కస్టమర్లను ఆకర్షించడమే లక్ష్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు.. పసందైన విందుతోపాటు వినోదాన్ని అందించేందుకు పెద్దపీట వేస్తున్నాయని అన్నారు.



## టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**తొర్రూరు, విశాలభారతి:**
ఈ నెల 28,29,30తేదీలలో నల్లగొండలో జరుగు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆరవ విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమము తొర్రూరు ఉన్నత పాఠశాల ఆవరణలో మండల ఉపాధ్యక్షులు చైతన్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు మురళి కృష్ణ మాట్లాడుతూ ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగ పరిస్థితిలు, విద్యారంగ బలోపేతం, విద్యారంగ, ఉపాధ్యాయ రంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఈ రమేష్, యాకెందర్, రాయలు, నారాయణ,పార్వతి, రంజిత్ ,జనార్ధన్, మహేందర్, మౌనిక, మమత, పల్లవి, యాకూబ్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రగతితో తెలంగాణ గ్రామాల అభివృద్ధి దేశానికి ఆదర్శం

▸ కడ్తాల్ పంచాయతికి బీహార్ సర్పంచుల అభినందన



**ఆమనగల్లు, విశాల భారతి :**
తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె ప్రగతితో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని, ఆరోగ్యకరంగా మారాయని బీహార్ గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు (సర్పంచులు) అన్నారు. రాజేంద్రనగర్ జాతీయ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి బీహార్ సర్పంచులతో NIRDPR రాజేంద్రనగర్ లో సమావేశమై గత పాలకవర్గంలో పల్లే ప్రగతి ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త వేరు విధానం, ఇంకుడు గుంతల నిర్వహణ,పల్లెప్రకృతి వనం, రైతు వేదిక,వైకుంఠధామం నిర్మాణాలు, గ్రామపంచాయతీల సొంత ఆదాయ వనరుల పెంపు మొదలగు అంశాలను వివరించారు. గ్రామాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో అందరితో కలిసి సమిష్టి నిర్ణయాలు తీసుకున్నందునే అభివృద్ధిలో ముందున్నామని తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ అరుణ్ రాజ్ , సిక్కిం గ్రామ పంచాయతీల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ కాలనీలో ఘనంగా బేతెస్థ మందిరం ప్రారంభోత్సవం

▸ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా

**సూర్యాపేట, విశాల భారతి**
సూర్యాపేట జిల్లా కేంద్రంలోని యన్. టి. ఆర్ కాలనీ, సీతారాంపురంలో బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా బేతెస్థ నూతన మందిరాన్ని ప్రారంభించినారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించినారు. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథులుగా రెవ. డా. యం. యస్. వినాయక రావు, బిషప్ సమర్పన్ కుమార్, యేడిద జాన్సీ రాణి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ నియోజకవర్గ పాస్టర్స్ చైర్మన్ రెవ. డా. మీసా దేవసహాయం, రెవ. డా. బత్తుల జోయెల్ రాజ్ ,పాస్టర్ మాడుగుల సుందర్ రావు, పాస్టర్ రాజేష్,క్రైస్తవ జానపద గాయకులు బ్రదర్ జీడీ సుందరన్న,సూర్యాపేట రూరల్ అధ్యక్షులు పాస్టర్ యల్క ప్రభాకర్, రెవ. డా. పంది మార్క్,పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రదర్ బొల్లు జాన్ పాల్,కొమ్ము హోసన్నా,పాస్టర్ కొండేటి లాజర్, మొరుగురి రూబెన్,పాస్టర్ రెబెల్లి యేసురత్నం,నర్సింగ్ భాస్కర్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అవంతి కాలేజ్ పై చర్యలు తీసుకోవాలి



**ఉస్మానియా,విశాలభారతి:**
డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ పేపర్స్ మార్పు వల్ల విద్యార్థులకు నష్టం చేసిన అవంతి కాలేజ్ పై చర్యలు తీసుకోవాలి ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కే అశోక్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ బీకాం పేపర్ మార్చి ఇవ్వడం వల్ల విద్యార్థులకు నష్టం చేసిన అవంతి కాలేజ్ పై చర్యలు తీసుకోవాలని , కాలేజీ పర్మిషన్ రద్దు చేయాలని స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేశారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ లో బీకాం ఫస్ట్ సెమిస్టర్ బీకాం కామర్స్ జనరల్ చదువుతున్న విద్యార్థులకు కామర్స్ జనరల్ పేపర్ ఇవ్వాల్సి ఉండగా బీకాం ఫైనాన్స్ పేపర్ ఇవ్వడంతో విద్యార్థులకు చాలా నష్టం జరుగుతోందన్నారు.

## ఘనంగా కలికోట శంకర్ జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు కలికోట శంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.శుక్రవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు,పెద్దలు కాలనీ వాసులు కేక్ కట్ చేపించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన బస్వతరక క్యాన్సర్ హాస్పిటల్ వద్ద పేదలకు భోజనం పంపిణి చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు.ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ యూత్ ప్రెసిడెంట్ సుల్తాన్, కలికోట మహేష్, బాలరాజు, జిబెన్, నవాజ్, తదితరులు పాల్గొన్నారు.





# ఇంధన పొదుపు మనందరి బాధ్యత

- యాచారం జెడ్పీఎచ్ఎస్ లో ఇంధన పొదుపు వారోత్సవాలు
- ముఖ్యఅతిథి గా పాల్గొన్న ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ రంగారెడ్డి జిల్లా మేనేజర్ సురేష్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :** ప్రతి ఒక్కరు బాధ్యతగా ఇంధనం పొదుపు చేయ్యాలని, ప్రపంచానికి ఇంధనమే చోధక శక్తి అని ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ రంగారెడ్డి జిల్లా మేనేజర్ సురేష్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా "సురేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇంధనంలో సింహభాగం బొగ్గు, ముడి చమురువే వాటితో కర్బన ఉద్గారాలు పెద్ద ఎత్తున వెలువడి, వాతావరణం కలుషితం అవుతూన్నాయని పర్యవసానంగా అనర్థాలు ఎన్నో జరుగుతున్నాయని అన్నారు. భారత్ సహా అన్ని దేశాలు ఇంధనాలను తగ్గించుకొనుటకు పునరుత్పాదక వనరుల వినియోగాన్ని పెంచుకోవడం ఎంతో అవసరం అన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా యాచారం విద్యార్థులకు ఇంధనం పొదుపుపై పెయింటింగ్ కార్యక్రమం జగదీశ్వర్ నిర్వహించారు. ఈ పోటీలో యస్. వైష్ణవి కు మొదటి బహుమతి నీహారిక కు రెండవ బహుమతి మీనా లకు మేనేజరు సురేష్ రెడ్డి డెవలప్ మెంట్ అధికారి ఎల్లయ్య శోకం , ఫీల్డ్ ఆఫీసర్ రామక్రిష్ణ బహుమతులు అందించారు.

# కార్మిక శాఖకు మంత్రిని నియమించాలి

- బీసీడబ్ల్యూ ఎఫ్-సిఐటియు జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య



**డోర్నకల్, విశాలభారతి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా నేటికీ కార్మిక శాఖ కు మంత్రిని నియమించకుండా కాలం గడుపుతున్నారని ప్రభుత్వం వెంటనే కార్మిక శాఖ మంత్రిని నియమించాలని అదర్స్ కన్స్ట్రక్షన్ ఆఫ్ యూనియన్జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య అన్నారు. శుక్రవారం మహబూబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గిరిపురం గ్రామంలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా కార్మికులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షల మంది భవన నిర్మాణ రంగం లో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్మికులంతా రోజువారిగా పని చేస్తేనే కుటుంబాలు గడిచే పరిస్థితి ఉందని కార్మిక శాఖ బోర్డు ద్వారా రావలసిన హక్కులను వారికి రానీయకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతుందని ఆయన ఆరోపించారు. ఇప్పటికే కార్మిక శాఖను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పాలని కుట్ర చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికే చాలామంది కార్మికులకి రావలసిన బిల్లులు విడుదల చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాప్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మిక రంగంపై సవతి తల్లి ప్రేమను విడాలని ఆయన హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిన సందర్భంగా వారోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో నేటికీ కార్మిక శాఖకు మంత్రిని నియమించకపోవడం శోచనీయమన్నారు, అడ్వైజర్ కమిటీ ని యమించకుండా నిర్లక్ష్యం చేయడం సరైనది కాదన్నారు . కార్మిక శాఖలో జరిగే పరిణామాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కావాలంటే ఆ శాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. సర్వేలో భవన నిర్మాణ కార్మికులు ఆ గ్రామ మాజీ సర్పంచ్, సెంట్రింగ్ మేస్త్రి పెద్ద బోయిన జనార్ధన్, మార్బుల్స్ యూనియన్ మండల నాయకులు పటాన్ యాకుబ్, గుడి సైదులు, ఎస్.కె పాషా, సయ్యద్ ఖలీల్, హుస్సేన్, ఏకాంబరం, అబ్దుల్, స్వామి, కరీం, తదితరులు పాల్గొన్నారు.



# ఆటో యూనియన్ జేఏసీ చైర్మన్ ముందస్తు అరెస్ట్

- అరెస్టు ను ఖండించిన ఆటో యూనియన్ నాయకులు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** హైదరాబాదులో జరగనున్న ఆటో యూనియన్ల మహా ధర్నా నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఆటో యూనియన్ జేఏసీ చైర్మన్ వేణు గోపాలరావుని ఇబ్రహీంపట్నం పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ ఆటో కార్మికుల పట్ల అత్యంత కర్కషంగా వ్యవహరిస్తున్నదని పేద ప్రజలపై రేవంత్ రెడ్డి సర్కార్ పగ పట్టిందని ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్న నిరుద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వము లక్షలాదిమందికి ఉపాధి చూపుతున్న ఆటోరంగంపై సానుభూతితో వ్యవహరించాల్సింది పోయి కక్షపూరితంగా వ్యవహరించడం సరి కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఔటర్ రింగ్ రోడ్డు అవతలి వరకే ఆటో నడపడం అనేది అంశము వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు ఇలాంటి తుగ్లక్ చర్యల వల్ల లక్షలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడుతారన్నారు. అలాగే ప్రభుత్వం వెంటనే ప్రతి ఆటో డ్రైవర్ కు రూ . 12 వేలు అందించాలని ఫిట్నెస్ టాక్స్ ఇన్సూరెన్స్ లను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని డ్రైవింగ్ లైసెన్స్ లపై ఆటో డ్రైవర్లకు ఫీజులను ఎత్తివేయాలని అలాగే అర్హత కలిగిన అన్ని ఆటో డ్రైవర్లకు రాయితీలపై ఆటోలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వము ఈ అంశంపై యూనియన్లతో చర్చించి వారి సలహా సూచనలతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జీవనోపాధి కోల్పోకుండా చూడమని కోరితే ముందస్తు అరెస్టులతో నిర్బంధకాండతో ఉద్యమాలను అనచాలని చూడడం దుర్మార్గమని ఆయన విమర్శించారు.అరెస్టయిన వారిలో జేఏసీ చైర్మన్ వేణుగోపాల్ , సద్గుణ చారి, రాములు పోల్కంపల్లి శ్రీనివాస్ వినోద్ రవి సురేష్ మాదాసు రవి తదితరులు ఉన్నారు.

# అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరాఫ్ చేయాలి



**తుంగతుర్తి, విశాలాభారతి:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారిని ఉద్దేశించి రాజ్యసభలో అవమానకరంగా అవహేళన మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ నాయకులు తడకమళ్ళ రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విలేకరులతో మాట్లాడుతూ బే షరతుగా అంబేద్కర్ గారి పై చేసిన వాక్యాలను వెనక్కి తీసుకోవాలని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలతో రాజ్యాంగంపై అంబేద్కర్ గారిపై బిజెపి విధానం ఏంటో అర్థమవుతుందని తెలిపారు. మతోన్మాద దళితుల వ్యతిరేక పార్టీ బిజెపి కాదని నిరూపించుకోవాలంటే ప్రధాని నరేంద్ర మోడీకి బిజెపి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పందించి రాజ్యాంగ రూపకర్తను కించపరిచి మాట్లాడిన అమిత్ షాను పార్టీ నుండి తొలగించి, కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరాఫ్ చేయాలి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.



# రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజేషన్ చేయాలి

**తుంగతుర్తి, విశాలభారతి:** తెలంగాణ ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ పిలుపుమేరకు తుంగతుర్తి మండలనకు చెందిన కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు 48 గంటల పాటు జిల్లా వైద్య శాఖ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. కరోనా సమయంలో కూడా తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించామని అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమను రెగ్యులరైజేషన్ చేస్తామని చెప్పారని అన్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం తాము 18 సంవత్సరాల పైగా విధులు నిర్వర్తిస్తూ చేస్తున్న కృషిని గుర్తించి వ్రాత పరీక్ష లేకుండా తమను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు . ఈ నిరసన కార్యక్రమాన్ని 48 గంటల పాటు నిర్వహించి అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం కు అందజేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఏఎన్ఎంలు స్వప్న, భారతి, కమల, రజిత, మమత తదితరులు పాల్గొన్నారు.

# సిసిఎల్ మంజూరు చేయాలి



**దంతాలపల్లి, విశాలభారతి:** సీసీఎల్ మంజూరు చెయ్యాలని ఎంపీడీవోకి వినతిపత్రం అందజేసిన టిపిటిఎఫ్ మండల శాఖ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ ఆరవ తేదీ నుండి నవంబర్ 20వ తేదీ వరకు ఎన్యుమరెటర్లుగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విధులు నిర్వహించారు. ఈ సమగ్ర సర్వే షెడ్యూల్ కాలంలో సాధారణ సెలవు రోజులైనా నవంబర్ 9, 10 ,15 మరియు నవంబర్ 17 మొత్తం నాలుగు రోజులు సర్వే విధులు నిర్వహించారు. ఈ నాలుగు సేలవ రోజులలో సర్వే విధులు నిర్వహించిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సిసిఎల్ మంజూరు ఉత్తర్వులు విడుదల చేసేలా చొరవ తీసుకోవాలని దంతాలపల్లి ఎంపీడీవో యన్. వివేక్ రామ్ కి దంతాలపల్లి టి పి టి ఎఫ్ మండల శాఖ ప్రాతినిధ్యం చేసింది. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు తాలూరి రవీందర్, టిపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి చింతల సురేష్, ఉపాధ్యాయులు పావని పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని పరిపాలించలేడు

- హామీలు అమలు చేయలేక అవస్థలు
- పాలనపై అవగాహన రాహిత్యం తోనే అరెస్టులు
- మాజీ మంత్రి డిఎస్ రెడ్యా నాయక్

**డోర్నకల్, విశాలభారతి:** పాలన పై కనీస అవగాహన లేని సీఎం రేవంత్ రెడ్డి రైతు, ప్రజా సంక్షేమం మరిచి విపక్ష పార్టీల నేతలను అరెస్టు చేయిస్తూ కాలయాపన చేస్తున్నారని రాష్ట్రాన్ని పరిపాలించలేని రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి డిఎస్ రెడ్యా నాయక్ ఆరోపించారు. డోర్నకల్ నియోజక వర్గ కేంద్రమైన మరిపెడ మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం ఆయన మాజీ జిల్లా గ్రంథాలయం చైర్మన్ గుడిపూడి నవీన్ రావు తో కలిసి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలన లో మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ లో ఈ _కార్ రెజింగ్ పోటీలను నిర్వహించి ప్రపంచ దేశాలకు వేదిక గా నిలిపినట్లు తెలిపారు. హైదరాబాద్ ఇమేజ్ నూ ప్రపంచ దేశాల ముందు నిలిపి పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు కేటీఆర్ చేసిన కృషి శ్లాఘనీయమైంది అని కొనియాడారు. రాజకీయం గా కే టీ ఆర్ ను ఎదుర్కోలేక కార్ రేసింగ్ లో అవినీతి జరిగినట్లు విష ప్రచారం చేస్తూ కేటీఆర్ పై కేసు నమోదు చేయటం ఖండిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ పాలన లో సంక్షేమం నెలకొంటే రేవంత్ ఏడాది పాలన లోనే క్షామం నెలకొందన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలకు ఇచ్చిన హామీలు విస్మరించి రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఎన్నికల ముందు అలవీ కానీ హామీలు ఇచ్చి అధికారం దక్కించుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీల అమలు పై కేటీఆర్ నిలదిస్తున్నందున సమాధానం చెప్పలేక అక్రమ కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, బీఆర్ ఎస్ జిల్లా నాయకులు గుగులోతు రాంబాబు, తేజవాతు రవీంద్ర నాయక్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు దిగజార్ల శ్రీనివాస్, దుస్స నర్సయ్య, గోల్కొండ వెంకన్న తదితరుల పాల్గొన్నారు.



# అమిత్ షా పై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి

**వాజేడు, విశాలభారతి:** అంబేద్కర్ పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయన పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జెజ్జరీ దామోదర్ డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం వాజేడు మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెూంమంత్రి అమిత్ షా రాజీనామా చేయా లని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఒక్కరికి మాత్రమే కాదని, సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొన సాగిస్తున్న లక్షలాది మంది అణగారినవర్గాల వారికి జరిగిన అవమానమని అన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న దాడికి వ్యతిరేకంగా ప్రజల నుంచి పెరుగుతున్న ప్రతిఘటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. కార్యక్రమంలో ఇద్వా జిల్లా అధ్యక్షురాలు బచ్చల సౌమ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బచ్చల కృష్ణ బాబు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు పూనెం కృష్ణబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు పెదం రమాదేవి, జెజ్జరీ ఆదినారాయణ, సీత తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

- కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు లూనావత్ విజయ్ నాయక్

**కురవి, విశాలభారతి:** మండలంలోని బంచరాయి తండా గ్రామంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కులను డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ మరియు మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం ఆదేశాల మేరకు గ్రామ పార్టీ అధ్యక్షులు లూనావత్ విజయ నాయక్, గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు బానోతు సూర్య నాయక్, బంచరాయి తండా గ్రామ యూత్ అధ్యక్షులు లూనావత్ కృష్ణ నాయక్ మరియు పున్నం నాయక్ మరియు బంచరాయి తండా గ్రామ కాంగ్రెస్ నాయకులు సేటియా,లింగు, ఆప్పు,అప్పారావు,విజయ్,భద్రు, వీరు కలిసి భానోతు రూప్ల కి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# సినిమా



cinema updates


## అలాంటి అబ్బాయి కావాలి!

అగ్ర కథానాయిక రష్మిక మందన్న వరుస సినిమాలతో బిజీగా ఉంది. 'పుష్ప-2' విజయోత్సాహంలో ఉన్న ఈ భామ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. తన లైఫ్‌లోకి రాబోయే భాగస్వామి ఎలా ఉండాలో వివరించింది. జీవితంలోని ప్రతీ మలుపులో అతను తోడుండాలని, కష్టసమయంలో అండగా నిలబడాలని, అన్నివేళల్లో భద్రతనివ్వాలని చెప్పింది. రష్మిక మందన్న మాట్లాడుతూ 'స్త్రీ పురుష సంబంధాల్లో పరస్పర గౌరవం, నమ్మకం చాలా ముఖ్యమైన అంశాలు. ఒకరిపట్ల ఒకరికి గౌరవం ఉంటే జీవితాంతం కలిసి ఉండొచ్చు. కోపతాపాలకు దూరంగా అర్థం చేసుకునే సహృదయత కలిగి ఉండాలి. అలాంటి అబ్బాయే కావాలనుకుంటున్నా' అని చెప్పింది. జీవితానికి తప్పకుండా ఓ తోడు అవసరమని, మన కష్టాలను పంచుకునే వారు లేని జీవితాన్ని ఊహించలేమని రష్మిక మందన్న అభిప్రాయపడింది. ప్రస్తుతం ఆమె 'ది గర్ల్‌ఫ్రెండ్' 'రెయిన్‌బో' 'సికందర్' 'ఛావా' 'కుబేర' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



## 'సంక్రాంతికి వస్తున్నాం' నుంచి మెస్మరైజింగ్ లవ్ నెంబర్ మీను రిలీజ్

వి క్టరీ వెంకటేష్ హైలీ యాంటిసిపేటెడ్ హోల్సమ్ ఎంటర్టైనర్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఎక్సటెన్సీవ్ ప్రమోషన్లతో ఇప్పటికే స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేసి ఆడియన్స్ దృష్టిని ఆకర్షించింది. ఇందులో వెంకటేష్ ఎక్స్ కాప్ పాత్రలో, ఐశ్వర్య రాజేష్ అతని భార్యగా, మీనాక్షి చౌదరి అతని ఎక్స్ లవర్ గా కనిపించనున్నారు. బ్లాక్ బస్టర్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ సింగిల్ గోదారి గట్టు, గ్లోబల్ టాప్ 20 వీడియోల లిస్టు లోకి ఎంటరైయింది. సెకండ్ సింగిల్ 'మీను' ప్రోమో వెంకటేష్ పుట్టినరోజున విడుదలై ఫుల్ కోసం కోసం ఉత్సాహాన్ని రేకెత్తించింది, ఈ రోజు ఫుల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఇన్స్టంట్ గా కనెక్ట్ అయ్యే మరో మెస్మరైజింగ్ నెంబర్ ని భీమ్స్ కంపోజ్ చేశారు. భార్య పాత్ర పోషించిన ఐశ్వర్య రాజేష్ తో తన ప్రేమ కథను వెంకటేష్ వివరిస్తున్నట్లు ఈ పాట చిత్రీకరించారు. పోలీస్ అకాడమీలో ట్రైనర్‌గా పనిచేస్తున్నప్పుడు, అతను తన ట్రైనీ మీనాక్షితో ప్రేమలో పడతాడు. వారు వివిధ ప్రదేశాలను సందర్శిస్తారు, కలిసి కొన్ని మంచి క్షణాలను పంచుకుంటారు. వారి సాన్నిహిత్యం ఉన్నప్పటికీ, అతను ఆమెను ముద్దు పెట్టుకోకుండా తప్పించుకుంటాడు, తన మొదటి ముద్దు తన భార్యతో మాత్రమే అని రివిల్ చేస్తాడు. వెంకటేష్ మీనాక్షిని ముద్దుపెట్టుకునే అవకాశాన్ని పొందిన ఇంటెన్స్ మూమెంట్ తో సాంగ్ లో చాలా బ్యూటీఫుల్ మూమెంట్స్ ఉన్నాయి. ఈ పాటకు అనంత శ్రీరామ్ బ్యూటీఫుల్ లిరిక్స్ రాశారు. ప్రణవి ఆచార్యతో కలిసి భీమ్స్ అద్భుతంగా పాడారు. వెంకటేష్, మీనాక్షితో పాటు ఐశ్వర్యతో లవ్లీ కెమిస్ట్రీని పంచుకున్నారు. ఈ పాటకు భాను మాస్టర్ కొరియోగ్రాఫర్. తప్పకుండా ఈ పాట కూడా స్మాషింగ్ హిట్ అవుతుంది.



## వందేళ్ల హిందీ సినిమా చరిత్రను తిరగరాసిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్

ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, బ్రిలియంట్ దర్శకుడు సుకుమార్ కలయికలో రూపొందిన అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'పుష్ప-2' ది రూల్. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ఈ చిత్రం విడుదలకు ముందే పలు కొత్త రికార్డులను క్రియేట్ చేసిన ఈ ఇండియన్ బిగ్గెస్ట్ మూవీ విడుదల తరువాత సృష్టిస్తున్న సంచలనాలు అన్నీ ఇన్నీ కావు. విడుదలైన తొలిరోజే నుంచే అన్ని ఏరియాల్లో కలెక్షన్స్ విషయంలో ఆల్‌టైమ్ రికార్డులు నెలకొల్పుతున్న పుష్ప-2 ది రూల్ బాక్సాఫీస్ వద్ద తన హవా కొనసాగిస్తుంది. ముఖ్యంగా వందేళ్ల హిందీ సినీ చరిత్రలో 'పుష్ప-2' చిత్రంతో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ కొత్త రికార్డులు క్రియేట్ చేస్తున్నాడు. ఇప్పటి వరకు హిందీ సినీ చరిత్రలో ఏ సినిమా కలెక్ట్ చేయని విధంగా కేవలం 15 రోజుల్లోనే 632 కోట్ల 50 లక్షల రూపాయాల వసూళ్లను సాధించిన తొలి భారతీయ చిత్రంగా 'పుష్ప-2' దిరూల్ ఆ ఘనతను దక్కించుకుంది. ఇప్పటి వరకు హాయ్యెస్ట్ వసూళ్లను సాధించిన చిత్రంగా ఉన్న'స్త్రీ2' చిత్రం లైఫ్ టైమ్ రన్‌ను కేవలం 15 రోజుల్లోనే పుష్ప-2 అధిగమించడం విశేషం. దీంతో పాటు అత్యంత వేగంగా 14 రోజుల్లోనే రూ.1500 కోట్ల రూపాయాలు సాధించిన తొలి భారతీయ చిత్రంగా, కేవలం ముంబయ్‌లోనే 200 కోట్ల రూపాయాల నెట్‌ను వసూలు చేసిన తొలిచిత్రంగా పుష్ప-2 రికార్డు క్రియేట్‌చేసింది. ఇక 2024 సంవత్సరంలో హ్యాయ్యెస్ట్ గ్రాస్‌ను సాధించిన తొలి భారతీయ సినిమాగా రికార్డును నమోదు చేసింది. అల్లు అర్జున్ తన కెరీర్‌లో పుష్ప ది రైజ్, పుష్ప ది రూల్ చిత్రాలతో 2021 మరియు 2024లో బ్యాక్ టు బ్యాక్ హ్యాయెస్ట్ గ్రాసర్స్ వసూలు చేసిన ఇండియన్ సినిమాల హీరోగా కూడా కొత్త రికార్డను సాధించాడు. భవిష్యత్‌లో పుష్ప-2 ది రూల్ లాంగ్ రన్‌లో మరిన్ని సరికొత్త రికార్డులు ఐకాన్ స్టార్ సొంతం చేసుకోబోతున్నాడని అంటున్నాయి ఇండియన్ ట్రేడ్ వర్గాలు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.